ఆర్టీసీ ఎండీ చొరవతో విద్యార్థులకు బస్సు సౌకర్యం

కొత్తపల్లి, జూలై 26 : మండలంలోని నాగులమల్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు ఎదుర్కొంటున్న రవాణా కష్టాలను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తీర్చారు. గ్రామం నుంచి ఎలగందులలోని మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు సరైన బస్సు సౌకర్యం లేక కొన్ని సంవత్సరాలుగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. స్థానికులు డాక్టర్ కేవీ చారి, నాయకులు రాచకొండ అనిల్, కడార్ల రతన్ కుమార్ ఇటీవల హైదరాబాద్‌లో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌ను కలిసి కొండాపూర్ విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన గ్రామం నుంచి పాఠశాలలకు వెళ్లేందుకు బస్సును ఏర్పాటు చేయాలని ఆదేశించగా, శుక్రవారం నుంచి బస్సు ప్రారంభమైంది. కొండాపూర్ నుంచి ఎలగందుల వరకు బస్సు సౌకర్యాన్ని ఆర్టీసీ అధికారులు కల్పించగా గ్రామస్తులు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు, జిల్లా ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కరీంనగర్‌కు బండి సంజయ్

విద్యానగర్, జూలై 26: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం ఉదయం కరీంనగర్ నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు కరీంనగర్‌లో మీడియా సమావేశంలో పాల్గొని అనంతరం చొప్పదండి నియోజకవర్గంలోని చెర్లపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభించి స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నారు.

తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీపీ

రాంనగర్, జూలై 26 : కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం సీపీ అభిషేక్ మొహంతి తనిఖీ చేశారు. కార్యాలయంలో గల పెండింగ్ కేసులపై సమీక్ష చేసి, వాటికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కర్రె స్వామి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు మున్సిపాలిటీలో పెద్దపీట

జమ్మికుంట, జూలై 26: జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మహిళలు ఆర్థికంగా ఎదగాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ మహ్మద్ అయాజ్ సూచించారు. శుక్రవారం జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో జీవనజ్యోతి పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయగా, వారు ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా పట్టణ సమాఖ్యకు చెందిన మహిళా సంఘ సభ్యులు స్టీల్ వస్తువులను కొనుగోలు చేసి, కిరాయికి ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి.రాజిరెడ్డి, ఏడీఎంసీ మల్లేశ్వరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు రాణి, కోశాధికారి గీత, కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత మండలంగా తీర్చిదిద్దడానికి సహకరించాలి

మానకొండూర్, జూలై 26: మండలాన్ని డ్రగ్స్, గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దడానికి గ్రామస్తులు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని మానకొండూర్ సీఐ సదన్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో యువత మత్తు బారిన పడి వారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నదని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ సేవిస్తున్నట్లు కనబడినా, వీటిని విక్రయించడం, రవాణా చేయడం లాంటి సమాచారం లభించినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించినా వెంటనే వారి వివరాలను స్టేషన్ ఎస్ హెచ్‌వో నంబర్ 8712670769కు ఫోన్‌చేసి లేదా వాట్సాప్, టెక్స్ట్ మెస్సేజ్ రూపంలో తెలుపాలని కోరారు. అలాగే బాధితులు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే వారికి తగిన న్యాయం చేస్తామని పేర్కొన్నారు. దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

8న కొత్తపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవీకి ఎన్నికలు

కొత్తపల్లి, జూలై 26 : కొత్తపల్లి మున్సిపల్‌లో ఖాళీగా ఉన్న వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ఆగస్టు 8న ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆగస్టు 6న కౌన్సిల్ సభ్యులకు నోటీసులు అందించి 8న ఎన్నికలు నిర్వహించనున్నారు. కొత్తపల్లి మున్సిపల్‌లో 2వ వార్డు సభ్యురాలిగా ఎన్నికై వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న బండ రాధ మరణించడంతో ఎన్నిక నిర్వహిస్తున్నారు. కొత్తపల్లి మున్సిపల్‌లో 12 మంది కౌన్సిలర్లుగా ఉండగా, ఒక సభ్యురాలు మరణించడంతో 11 మంది ఎన్నికల్లో పాల్గొననున్నారు.

ఎస్సారార్ కళాశాల బీఆర్ఎస్వీ అధ్యక్షుడిగా అన్వేష్

కమాన్‌చౌరస్తా, జూలై 26 : భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల(అటానమస్) అధ్యక్షుడిగా నాయిని అన్వేష్‌ను నియమిస్తూ బీఆర్ఎస్వీ శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. తన నియామకానికి సహకరించినందుకు కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కరీంనగర్ శాసన సభ్యుడు గంగుల కమలాకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ తదితరులకు అన్వేష్ కృతజ్ఞతలు తెలిపారు.

డిప్లొమాలో అడ్మిషన్లపై అవగాహన

గంగాధర, జూలై 26 : స్పాట్ పద్ధతిలో సిపెట్‌లో డిప్లొమా అడ్మిషన్లపై ట్రైనింగ్ ఇన్‌చార్జి శ్రీ ఆంజనేయ శర్మ, ఫ్యాకల్టీ గంగాధర స్వామి బుధవారం మండలంలోని మధురానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వ రసాయన, ఎరువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు డిప్లొమా ప్లాస్టిక్ టెక్నాలజీ అండ్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సులను అందిస్తున్నదని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలకు ట్రైనింగ్ ఇన్‌చార్జి శ్రీ ఆంజనేయ శర్మ 8093140230, ఫ్యాకల్టీ గంగాధర స్వామి 9618677011 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలి

కార్పొరేషన్, జూలై 26: రాష్ట్రంలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి కోరారు. శుక్రవారం స్థానిక వాసరా గార్డెన్‌లో జరిగిన రాష్ట్ర స్వర్ణకార సంఘం సర్వసభ్య సమావేశంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కార్పొరేట్ జువెల్లరీ సంస్థల వల్ల స్వర్ణకారులు పనులు లేక కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేకూరి వెంకటస్వామి, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, రాజా, ఆనందం, శ్రీధర్, కందుకూరి శ్రీనివాస్, రాజబ్రహ్మం, మహేశ్, రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఆర్టీసీ డీఎంగా రవీంద్రనాథ్

హుజూరాబాద్ రూరల్, జూలై 26: హుజూరాబాద్ ఆర్టీసీ డిపో నూతన డీఎంగా రవీంద్రనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల ఆర్టీసీ డీఎంగా పనిచేస్తున్న రవీంద్రనాథ్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

సబ్ జైలర్‌కు సన్మానం

హుజూరాబాద్ రూరల్, జూలై 26: ఇటీవల బదిలీపై వచ్చిన హుజూరాబాద్ సబ్ జైలర్ నాంపల్లి దేవేందర్‌ను జీకే రైతు మిత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు స్వామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చందుపట్ల జనార్దన్, కంకణాల జనార్దన్ రెడ్డి, సభ్యులు అనురాధ, వెంకటయ్య, వీరస్వామి, జ్యోతి, సంపత్ రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు

గన్నేరువరం, జూలై 26: గెట్టు వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తాండ్ర నరేశ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన భూమాడి కిరణ్ కుమార్ రెడ్డి, భూమాడి రత్న కాంతమ్మా అలాగే గన్నేరువరం గ్రామ మాజీ సర్పంచ్ పుల్లెల లక్ష్మి, పుల్లెల లక్ష్మణ్, పుల్లెల సాయి ఇరువర్గాలు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

మహిళలకు సమాన హక్కులను కల్పించాలి

తెలంగాణచౌక్, జూలై 26: మహిళలకు అన్ని రంగాల్లో సమాన హక్కులను కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కోరారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహిస్తున్న నాలుగు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు ఆమె హాజరై మాట్లాడారు. రాజకీయ శిక్షణ తరగతుల్లో మహిళాలను చైతన్యపరిచి మహిళా హక్కుల సాధన కోసం పోరాడుతామని తెలిపారు. అంతకుముందు రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత, జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమ్మె నోటీస్

తిమ్మాపూర్ రూరల్, జూలై 26 : పర్లపల్లి హరిత బయో ప్రొడక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులు వేతనాల పెంపు, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం శుక్రవారం కంపెనీ పర్సనల్ జనరల్ మేనేజర్ జగన్‌మోహన్ నాయుడుతోపాటు కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటరమణకు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి మహేందర్, కోశాధికారి సంపత్, ఉపాధ్యక్షులు మహేందర్, అశోక్, పవన్, మధు, రాజు, వెంకటరమణాచారి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

- ఇల్లాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఇల్లు బాగుంటుంది
- 'శుక్రవారం సభ'లో కలెక్టర్ పమేలా సత్పతి

రామడుగు: వెదిర అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

రామడుగు, జూలై 26 : మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఇల్లాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ ఇల్లు బాగుంటుందని పేర్కొన్నారు. రామడుగు మండలం వెదిర అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శుక్రవారం సభకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడారు. మహిళల ఆరోగ్యంపైనే ఇంటిల్లిపాది ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. సమస్యల పరిష్కారానికే ప్రతి శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలంతా శుక్రవారం సభను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద ప్రతి మంగళవారం ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టాలని, మహిళలు అందరికీ లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. అనవసరంగా ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని మహిళలకు సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్డీవో శ్రీధర్, బీసీడీవో అనిల్‌ప్రకాశ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, తహసీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.

ఎదుగుదలకు పౌష్టికాహారం ముఖ్యం

తిమ్మాపూర్ రూరల్/ కలెక్టరేట్/కరీంనగర్ రూరల్/ సైదాపూర్/శంకరపట్నం/తిమ్మాపూర్ రూరల్, జూలై 26: తల్లులు సరైన పోషకాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ సూచించారు. తిమ్మాపూర్ మండలంలోని కొత్తపెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభకు ఆయన హాజరై మాట్లాడారు. రక్తహీనత, ఆహారం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీవో రవీందర్, ఎంపీడీవో విజయ్ కుమార్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీవో కిరణ్, మెడికల్ ఆఫీసర్ ప్రణవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు. నగరంలోని సాహెత్‌నగర్ క్లస్టర్‌లో నిర్వహించిన శుక్రవారం సభలో సవరణ్ స్టీట్ సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజమణి పాల్గొని మాట్లాడారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసమే శుక్రవారం సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.శోభారాణి, ఆరోగ్య పర్యవేక్షకురాలు లక్ష్మి వివిధ అంశాలకు సంబంధించి అవగాహన కల్పించారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ సెక్టార్ పరిధిలోని చెర్లభూత్కూర్ అంగన్‌వాడీ-2 సెంటర్‌లో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడుతూ, మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ రమణారెడ్డి, పాఠశాల హెచ్ఎం భారతి, సూపర్‌వైజర్ నిర్మల, సతీశ్ తదితరులు పాల్గొన్నారు. సైదాపూర్ మండలం వెన్నంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభకు మండల వైద్యాధికారి సౌమ్య హాజరై గర్భిణులు, బాలింతలు ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. శంకరపట్నం మండలం ముత్తారం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభకు హాజరైన ఎస్‌వో నాగార్జున పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, పల్లె దవాఖాన వైద్యురాలు శ్వేత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రవంతి, సీహెచ్‌వో భాస్కర్, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

నగరంలోని జాన్సన్ కోరా పాఠశాలలో బోనాలతో విద్యార్థులు

రామడుగు : గుండిలో బోనాలతో అక్షర స్కూల్ విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, జూలై 26 : జిల్లా కేంద్రంలోని పలు విద్యాసంస్థల్లో బోనాల వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతరాజుల వేషధారణలో డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. పారమిత ఉన్నత పాఠశాలలో ఉత్సవాలను పారమిత విద్యాసంస్థల డైరెక్టర్ ప్రసూన ప్రసాదరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులతో కలిసి ప్రారంభించారు. అలాగే, జాన్సన్ కోరా పాఠశాలలో బోనాల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్ రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగళ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానేరు సీబీఎస్ఈలో..

కొత్తపల్లి, జూలై 26: కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో బోనాల ఉత్సవాలను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న కాలానికనుగుణంగా విద్యాసంస్థల్లో ప్రతి

విద్యాలయాల్లో బోనాల పండుగ

బోనాలతో వస్తున్న పారమిత విద్యాసంస్థల డైరెక్టర్ ప్రసూన ప్రసాదరావు

పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలుపుతూ సంబురాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు పోతరాజుల వేషధారణలో విన్యాసాలు చేస్తూ బోనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డితో పాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్షర పాఠశాలలో..

రామడుగు, జూలై 26 : అక్షర హైస్కూల్ గుండి క్యాంపస్‌లో తెలంగాణలో ప్రసిద్ధి చెందిన తెలంగాణ బోనాల పండుగ ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థులు స్కూల్ నుంచి గోపాల్‌రావుపేట బస్టాండ్ కూడలి వరకు బోనాలతో ఊరేగింపుగా చేరుకున్నారు, బస్టాండ్‌లో అమ్మ వారి పాటలకు నృత్యాలు చేశారు. పోతరాజుల వేషధారణలు, వారి నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మినుకుల మునీందర్, డైరెక్టర్ రాధ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విన్నర్స్ విద్యాలయంలో..

రామడుగు మండల కేంద్రంలోని విన్నర్స్ విద్యాలయంలో బోనాల వేడుకల సందర్భంగా కరస్పాండెంట్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్ విద్యార్థులకు తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగంపై చిత్తశుద్ధి ఏది?

తెలంగాణచౌక్/ కమాన్‌చౌరస్తా, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగంపై చిత్తశుద్ధి లోపించిందని, రూ.2.91లక్షల కోట్ల బడ్జెట్‌లో కేవలం రూ. 21.292 కోట్ల కేటాయింపుతోనే ఇది స్పష్టమైందని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో పలు చోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కమాన్‌చౌరస్తా వద్ద ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మచ్చ రమేశ్, నాయకులు ప్రీతం, జనార్దన్, మధు, రాము పాల్గొన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అలాగే తెలంగాణ చౌక్ వద్ద ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి వినయ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. విద్యారంగానికి బడ్జెట్ పెంచి, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

విరిగిపడిన చెట్ల కొమ్మలు తొలగింపు

కార్పొరేషన్, జూలై 26: ఎడతెరిపిలేని వర్షం కారణంగా నగరంలోని భగత్ నగర్, గణేశ్‌నగర్, శర్మ నగర్, సాయినగర్ ప్రాంతాల్లో శుక్రవారం చెట్ల కొమ్మలు విరిగిపడగా, సమాచారం అందుకున్న నగరపాలక సంస్థ డీఆర్ఎఫ్ బృందాలు తక్షణమే స్పందించి వాటిని తొలగించారు. వర్షాల వల్ల నగరంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా నగరపాలక సంస్థ కాల్ సెంటర్‌కు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

మానకొండూర్, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించడంపై కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు కనకం అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కవ్వంపల్లికి కృతజ్ఞతలు తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

హుజూరాబాద్ రూరల్, జూలై 26: కాట్రపల్లి గ్రామానికి చెందిన పీ శ్రీనివాస్ అనే గీతకార్మికుడు మోకు జారి తాటి చెట్టు పైనుంచి పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం అతడిని జమ్మికుంటలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు.

వివాహిత ఆత్మహత్యపై ఏసీపీ విచారణ

చొప్పదండి, జూలై 26: పట్టణంలోని సంతోషిన గర్‌కు చెందిన రాచకొండ మమత (28) గురువారం ఆత్మహత్య చేసుకోగా, ఈ ఘటనపై కరీంనగర్ రూరల్ ఇన్‌చార్జి ఏసీపీ కాశయ్య శుక్రవారం విచారణ జరిపారు. భర్త రాచకొండ లక్ష్మణ్ పిల్లలు కావడంలేదని మానసికంగా, శారీరకంగా హింసించడం వల్లే తమ కుమార్తె చనిపోయిందని మమత తల్లిదండ్రులు ముదిగంటి పద్మ, కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. ఈ క్రమంలో కరీంనగర్ రూరల్ ఇన్‌చార్జి ఏసీపీ కాశయ్య ఘటనా స్థలానికి వచ్చి మృతురాలి తల్లిదండ్రులతో పాటు ఇతర సాక్షులను విచారించి వారి వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

సొంత ఖర్చులతో సమాజ సేవ

వీణవంక, జూలై 26: మండల కేంద్రం నుంచి లస్మక్కపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఇటీవల కురిసిన వర్షానికి ఓ రైతు భూమిలో ఉన్న తుమ్మ చెట్టు రోడ్డుపై పడిపోయింది. దాన్ని గమనించిన లస్మక్కపల్లి గ్రామానికి చెందిన మద్దుల ప్రశాంత్ అనే యువకుడు జేసీబీని తెప్పించి రోడ్డుపై పడ్డ చెట్టుతో పాటు ప్రయాణానికి అడ్డుగా ఉన్న చెట్లను తన సొంత ఖర్చులతో తొలగించాడు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు జరిపే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హామీలను అమలు చేయాలి

తెలంగాణచౌక్, జూలై 26: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కోరారు. నగరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్న పార్టీ కరీంనగర్ ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ శిబిరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. తెలంగాణ ఊసే లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టారని విమర్శించారు. సైద్ధాంతికంగా విధానాలపై రాజకీయ అవగాహన పెంచుకొని ముందు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు టేకుమల్ల సమ్మయ్య, కటికరెడ్డి బుచ్చన్న, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కొయ్యడ సృజన్‌కుమార్, బోనగిరి మహేందర్, సదాశివ పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో డీఆర్‌వోకు వినతి

విద్యానగర్, జూలై 26: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల వేదికగా ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కట్ట రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఎస్టీ మోర్చా జిల్లా సెక్రటరీ మొగిలి శ్రీనివాస్, సార్ల అనిల్, బిజిలి సారయ్య, కుమారస్వామి, శ్రీనివాస్, రవినాయక్, అజయ్, అభి, నిఖిల్ పాల్గొన్నారు.

తుట్టిలో తప్పిన ప్రమాదం

వీణవంక, జూలై 26: గాలివానకు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో చెట్టుకొమ్మ విరిగి పక్కనున్న విద్యుత్ స్తంభంపై పడడంతో అది విరిగి రోడ్డుపై పడగా త్రుటిలో ప్రమాదం తప్పింది. స్తంభంతో పాటు విద్యుత్ వైర్లు కూడా రోడ్డుపై ప